ప్రజాశక్తి
శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

సాయం కోసం రైతు చూపు

నష్టం తగ్గింపుతో అన్నదాతల దిగాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఇటీవల భారీ వర్షాలతో పంటలు ముంపునకు గురైన పంటలకు ప్రభుత్వం నుంచి సాయం ఎప్పటికి అందుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు తొలి విడత 83 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని అంచనా వేసిన అధికారులు జిల్లా మొత్తం మీద 41,432 ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. దీంతో సగం మంది రైతులు నీరుగారిపోయారు. ఈనెల 11న కేంద్ర బృందం కోసం రూపొందించిన అంచనాలకు, రాష్ట్ర ప్రభుత్వం సాయం అందించేందుకు రూపొందించిన అంచనాలకు పొంతన లేకుండా పోయింది. దీంతో పంటలను తొలగించి మళ్లీ సాగు చేయాలంటే పెట్టుబడులు లేక రైతులు అల్లాడుతున్నారు. అంతేగాక పంటలను కాపాడుకునేందుకు చేసే ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయి... దెబ్బతిన్న పొలాల్లో పంట దిగుబడి వస్తుందా... లేక మొత్తం పీకేసి కొత్త పంట వేయాలన్న పెట్టుబడి ఎవరు ఇస్తారు? అనే మీమాంస రైతులను వెంటాడుతోంది.

అధికారులు నిర్ధారించిన 41,432 ఎకరాలకు చెందిన 24,212 మంది రైతులకు చెందిన ఎకరాకు రూ.10 వేలు చొప్పున మాత్రమే అందిస్తారని చెబుతున్నా ఈ సొమ్ము కూడా రైతుల ఖాతాల్లో ఎప్పటికీ జమ అవుతుందో ఇంకా స్పష్టత రాలేదు. జిల్లాలోని దాదాపు 11 మండలాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయినా నష్టం అంచనాల్లో చాలా తక్కువగానే చూపారనే విమర్శలు వచ్చాయి. పంటలు దాదాపు 10 రోజుల పాటు నీటిలోనే ఉండిపోవడంతో పూర్తి స్థాయిలో దెబ్బతిన్నట్టు ముందు ప్రకటించిన

▶ 2లో

పెదకాకానిలో నీట మునిగిన వరిపైరు, దెబ్బతిన్న పైరును చూపుతున్న రైతు (ఇన్‌సెట్)

మాజీ మంత్రి రజినీపై హోం మంత్రికి ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ మంత్రి విడదల రజినీపై హోం మంత్రి అనితకు పల్నాడు జిల్లా స్టోన్ క్రషర్ యాజమాన్యం గురువారం విజయవాడలో ఫిర్యాదు చేసింది. విడుదల రజిని అక్రమాలకు పాల్పడ్డారంటూ ఫిర్యాదు చేయగా విచారణ చేయిస్తానని మంత్రి చెప్పారు. మాజీ మంత్రి విడుదల రజినీ, అప్పటి విజిలెన్స్ ఎస్పీ జాషువా, రజినీ పిఏ రామకృష్ణ, ఆమె మరిది విడదల గోపి కలిసి రూ.2.50 కోట్లు తమ వద్ద తీసుకున్నారని యడ్లపాడు బాలాజీ స్టోన్ క్రషర్ యాజమాన్యం ఫిర్యాదులో పేర్కొంది. ఇదిలా ఉండగా పసుమర్రులో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ప్రకారం ఎకరా రూ.12 లక్షలు పలకగా జగనన్న ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి ఇస్తే ఎకరాకు రూ.31 లక్షలు ఇప్పిస్తానంటూ మంత్రి రజిని రైతులకు ఎరవేశారని, మొదటి రెండు విడతల్లో రూ.50 ఎకరాలు సేకరించగా ఎకరాకు కమీషన్ రూ.రెండున్నర లక్షల చొప్పున రూ.1.16 కోట్లు రైతుల నుంచి వసూలు చేశారని గతంలోనే ఆరోపణలున్నాయి. మూడు, నాలుగు విడతల్లో వందెకరాల వరకు సేకరించగా ఎకరాకు రూ.7.5 లక్షలు చొప్పున రూ.7.5 కోట్లు ఇవ్వాలంటూ రైతుల నుంచి ముందే చెక్కులు, నోట్లు తీసుకున్నారని పలువురు ఇప్పటికే ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్టాండులో అడ్డగోలు వ్యాపారాలు

- ఎమ్మార్పీలకు మించి విక్రయాలు
- నిలువు దోపిడీకి గురవుతున్న ప్రయాణీకులు

7లో

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

- అధికారులు, కాంట్రాక్టర్లకు మంత్రి పార్థసారథి ఆదేశం
- లే అవుట్‌లలో సమస్యల పరిష్కారం, బిల్లుల మంజూరుకు హామీ

లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

హౌసింగ్ లే అవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను మార్చి నాటికి పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. గురువారం సాయంత్రం గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, నగరపాలక సంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు, తాడికొండ ఎమ్మెల్యే టి.శ్రావణ్ కుమార్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి లబ్ధిదారులు, ఆప్షన్-3 కాంట్రాక్టర్లు, అధికారులతో మేడికొండూరు మండలం పేరేచర్ల లే అవుట్‌లో మంత్రి సమీక్షించారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ లే అవుట్‌లో నివాసం ఉంటున్నవారికి విద్యుత్తు సౌకర్యం సరిగా లేదని, ప్రధాన రహదారుల్లో వర్షం వస్తే ఇబ్బందిగా ఉందని చెప్పారు. కొంత మందికి ఇళ్ల పట్టాలిచ్చినా స్థలాలు చూపలేదని, కొంత మంది పట్టాల్లో పేర్లు తప్పులు ఉన్నాయని తెలిపారు. ఎమినిటీస్ సెక్రటరీ చెప్పారని ఇంటి నిర్మాణం కోసం రూ.3.50 లక్షలిస్తే అతను పారిపోయాడని, పోలీసులూ పట్టించుకోవటం లేదని ఒ మహిళ వాపోయారు. మంత్రి స్పందిస్తూ పేరేచర్ల లే అవుట్‌కు ప్రభుత్వం రూ.200-300 కోట్లు ఖర్చు చేసిందని, నివాసయోగ్యంగా నాణ్యమైన ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు చెప్పారు. విద్యుత్ సమస్య తీర్చాలని, పారిపోయిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి లబ్ధిదారులకు నగదు ఇప్పించాలని ఆదేశించారు. ప్రధాన రహదారి మరమ్మతు చేయిస్తామన్నారు. లే అవుట్‌లోని ఇళ్లను దశల వారీగా పూర్తి స్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల వివరాలతో పాటు, ఇళ్ల నిర్మాణాల పరిస్థితిని, నిర్మాణం ప్రారంభించాల్సిన ఇళ్ల వివరాలపై హౌసింగ్, నగరపాలక సంస్థ, క్షేత్రస్థాయి ఎమినీటి సెక్రటరీలతో ప్రత్యేకంగా సమావేశం

▶ 2లో

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

ఆ రెండూ ఇస్తే రైతులకు మేలు

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కృషి విజ్ఞాన కేంద్రం కోసం కేంద్ర మంత్రికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యవసాయమే ప్రధాన ఆధారితమైన పల్నాడులో పంట కోత అనంతరం ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించుకునేందుకు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల సాగుకు సంబంధించి ఇండో-డచ్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ కింద సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నెలకొల్పాలని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్‌ను నరసరావుపేట ఎంపీ, పార్లమెంట్‌లో టిడిపి పక్షనేత లావు శ్రీకృష్ణదేవరాయలు విన్నవించారు. ఢిల్లీలో మంత్రిని గురువారం కలిసిన ఎంపీ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు పంటకోత తర్వాత నిర్వహణలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని, పంట కోత అనంతరం నిర్వహించే కార్యక్రమాలకు వీలుగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని వినుకొండ మండలం వెంకుపాలెంలో మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు కోసం 25 ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉందని, ప్రాజెక్ట్ గ్రౌండింగ్ చేశారని వివరించారు. ఈ సెంటర్ పల్నాడు ప్రాంత రైతులకు ఉపయోగపడడంతోపాటు ఉత్పాదకతను పెంపొందించడం, పంట అనంతర నష్టాలను తగ్గించడం, మెరుగైన మార్కెట్ అనుసంధానం ద్వారా అంతర్ జిల్లాకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. గురజాల మండలం, జంగమహేశ్వరపురంలో అన్ని మౌలిక సదుపాయాలతో కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు.

జ్యూట్‌మిల్లు స్థలంలో అక్రమంగా నిర్మాణాలు

- యాజమాన్యాన్ని బెదిరించి అంబటి మురళీకృష్ణ పనులు
- కార్పొరేషన్ అధికారులు కుమ్మక్కు: ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నడిబొడ్డులో విలువైన ఆస్తిని బెదిరించి, భయపెట్టి అడ్డగోలుగా వైసిపి నాయకుడు అంబటి మురళీకృష్ణ దోచుకున్నాడని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జ్యూట్ మిల్లు యాజమాన్యాన్ని బెదిరించి స్థలం ఆక్రమించుకుని, నిబంధనలకు విరుద్ధంగా అంబటి మురళీ నిర్మాణాలు చేపడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంలో కొంత మంది వైసిపి నాయకులు కూడా భాగస్వాములుగా ఉన్నారన్నారు. గతంలో రేరా సభ్యులైన చందు సాంబశివరావు, కామేశ్వరరావును మ్యానేజ్ చేసుకుని నిర్మాణాలకు ఆర్డర్ తెచ్చుకున్నారని, 2023 నవంబరులో భజరంగ్ జ్యూట్ మిల్లు యాజమాన్యంతో కొత్త అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. 510 ప్లాట్లు నిర్మిస్తూ 87 ప్లాట్లుకు మాత్రమే భజరంగ్ యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నారని, కార్పొరేషన్ అధికారులు అంబటి మురళీతో కుమ్మక్కై, అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులు ఇప్పటికీ నిర్మాణాలు ఆపాలని ఆర్డర్స్ ఇవ్వలేదన్నారు. తాను స్పందించిన తరువాత టిడిపి కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారని, ఆ తరువాత కార్పొరేషన్ అధికారులు కంటి తుడుపుగా పరిశీలించి వచ్చారని అన్నారు. అంబటి మురళీ వివిధ శాఖలకు చెల్లించాల్సిన పన్నులు చెల్లించకపోయినా అధికారులు నిమ్మకు నీరత్తినట్టు వ్యవహరిస్తున్నారని, రైల్వే శాఖ ఈ నిర్మాణాలకు అభ్యంతరం వ్యక్తం చేసినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నిస్వార్థ సేవకుడు కాంపౌండర్ గురవయ్య

ప్రజాశక్తి - మాచర్ల

నాలుగు దశాబ్దాలకుపైగా పేదలకు ఉచిత వైద్యసాయం అందించటంలో నిస్వార్థంగా పనిచేసిన సేవకుడు కాంపౌండర్ గురవయ్య అని ప్రముఖ వైద్యులు కమలాహసన్‌రావు అన్నారు. స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆవరణలో మాజీ కౌన్సిలర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పల్లెబోయన గురవయ్య సంతాపసభ గురువారం నిర్వహించారు. డాక్టరు కమలాహసన్‌రావు మాట్లాడుతూ గురవయ్య చేసిన సేవలకు ప్రతిఫలంగా అతన్ని ప్రజలు రెండుసార్లు కౌన్సిలర్‌గా జనం గెలిపించారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, రిటైర్డ్ విద్యాశాఖ అధికారి రామక్రిష్ణరావు, ప్రముఖ న్యాయవాదులు కె.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, కె.సాయి మార్కోండారెడ్డి, కౌన్సిలర్ మదార్‌సాహెబ్ పాల్గొన్నారు.

'కృష్ణవేణి' విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - మాచర్ల

మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి జూనియర్ కాలేజీలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వై.వెంకటరామయ్య మాట్లాడుతూ కంటి సమస్యల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రక్తదానాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - మాచర్ల : రక్తదానాన్ని ప్రోత్సహించాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ కె.శివసుబ్రమణ్యం అన్నారు. మండల పరిధిలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో వాసవీ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారభించిన కె.శివసుబ్రమణ్యం మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాలను కాపాడొచ్చని, విద్యార్థులంతా రక్తదానం చేయాలని కోరారు. అనంతరం మాచర్ల పట్టణంలోని వాసవీ వృద్ధాశ్రమంలో వస్త్రాలు పంపిణి చేశారు. గోవులకు పశుగ్రాసాన్ని అందించారు. ఒ.చెన్నకేశవరావు, సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు, పి.నరసింహారావు, బి.రాజ్‌కుమార్, సిహెచ్.సత్యనారాయణ, రాధక్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : హెచ్ఐవి, టిబి, సుఖ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వరరావు అన్నారు. న్యాకో (ఎన్ఎసిఒ) నేతృత్వంలో 'మీకు తెలుసా' రాష్ట్రస్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్‌లో భాగంగా గురువారం మాచర్ల మండలంలో రాయవరం, కంభంపాడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

29న 5కె వాక్ ఫర్ హార్ట్

- లక్కీడ్రాలో మొదటి నలుగురికి రూ.10 వేల సైకిల్
- మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో '5కె వాక్ ఫర్ హార్ట్' నిర్వహిస్తామని మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని పనసతోటలో గల హాస్పిటల్లో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. 29న ఉదయం నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణం నుండి ఉదయం 6లకు వాక్ ప్రారంభమై బైపాస్ రోడ్డు-పల్నాడు రోడ్డు-మల్లమ్మ సెంటర్ మీదుగా నడక ప్రారంభించిన సత్తెనపల్లి రోడ్డుకు చేరుకుంటుందని చెప్పారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు తమ దైనందిన కార్యక్రమాలలో క్షణం తీరిక లేకుండా గడపడం, ఎక్కువ సమయం కూర్చుని పని చేయడం, శారీరక శ్రమ, వ్యాయామం, సరైన నడక లేకపోవడంతో చిన్న వయసులోనే యువత గుండె సంబంధిత వ్యాధులతో జీవితాన్ని అర్ధాంతరంగా ముగిస్తున్నారని డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. గుండె సంబంధిత వ్యాధుల పట్ల అవగాహన ఆశించిన మేర లేకపోవడం వల్ల కూడా ఎక్కువమంది గుండెపోటుకు గురవుతున్నారని చెప్పారు. దీనిని గమనించిన ప్రపంచ ఆరోగ్య వేత్తలు 2012లో, 2025 నాటికి నాన్-కమ్యూనికేషన్ వ్యాధుల కారణంగా ప్రపంచ మరణాలను 25 శాతానికి అరికట్టాలనే ఆలోచనతో ప్రపంచ వ్యాప్త సమావేశం ఏర్పాటు చేసి సెప్టెంబర్ 29ని ప్రపంచ హృదయ దినోత్సవంగా గుర్తించారని తెలిపారు. దీని ప్రధాన ఉద్దేశం ప్రతి ఒక్కరు గుండె జబ్బులపై అవగాహన పెంచుకొని, జాగ్రత్తలు తీసుకోవడమేనన్నారు. ఒక వ్యక్తికి గుండె జబ్బు సమస్య ఎంత తీవ్రంగా ఉందన్నది ముందస్తుగానే కార్డియాక్ సిటీ కరోనరి ఎంజియోగామ్ అనే టెస్ట్ ద్వారా కచ్చితంగా నిర్ధారించవచ్చని, గుండె జబ్బు ఏ స్థితిలో ఉందో 99 శాతం అంచనా వేయవచ్చని అన్నారు. 30 ఏళ్లుగా కార్డియాలజీ విభాగంలో ఎన్నో నూతన ఆవిష్కరణలు వచ్చినా చాలామంది మృద్రోగుల్లో గుండె జబ్బు లక్షణాలుండవని, ఏడాదికి ఒకసారైనా గుండె పరీక్షలు చేయించుకోవడం ద్వారా కొంతమేర గుండె జబ్బులు గుండెపోటు వల్ల వాటిల్లే ప్రమాదాలు అరికట్టొచ్చని సూచించారు. ఈ నేపథ్యంలోనే తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5 కె వాక్ ఫర్ హార్ట్ పేరుతో కార్యక్రమం చేపట్టామన్నారు. 2019 నుండి తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాక్‌లో పాల్గొనే వారు 9502304422, 6300184095, 8309797392 నందు సంప్రదించి నమోదు చేసుకోవాలని, మొదటి 2 వేల మందికి రూ.500 విలువ చేసే టి.షర్ట్, టోపి ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న వారిలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన నలుగురికి రూ.10 వేల విలువ చేసే సైకిల్‌ను అందజేస్తామన్నారు.

వంటరి మహిళలే లక్ష్యంగా దాడి, దోపిడి

పలు కేసుల్లో ముగ్గురు నిందితులు అరెస్టు - ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి - క్రోసూరు

వివరాలు వెల్లడిస్తున్న సిఐ సురేష్.. వెనక వరుసలో ముసుగులతో నిందితులు

వంటిరగా ఉన్న మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఆభరణాల చోరీకి పాల్పడే కేసుల్లో ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలేనికి చెందిన ఉనల దావీదు, బత్తుల సిసింద్రీ, బండారు వీరబ్రహ్మాంను అరెస్టు చేసి వారి వద్ద నుండి 3 బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను సిఐ పి.సురేష్ స్థానిక పోలీస్‌స్టేన్‌లో గురువారం వెల్లడించారు. ఈనెల 8న నిందితులు ముగ్గురూ కలిసి నాగిరెడ్డిపాలెంలో వృద్ధురాలపై కత్తితో దాడి చేసి మెడలోని బంగారు గలుసును లాక్కెళ్లారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 18న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఇతర ఘటనలూ వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది మే 31న నకరికల్లు మండలం, నరసింగపాడులో పొలంలో ఒంటరిగా గేదెలను మేపుతున్న మహిళను కత్తితో బెదిరించి, గుళ్లపల్లి శివారులో పచ్చగడ్డి కోసుకుంటున్న మహిళను బెదిరించి బంగారు గొలుసులు లాక్కెళ్లినట్లు అంగీకరించారు. నిందితుల నుండి ఆభరణాలతోపాటు కత్తి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సిఐతోపాటు కేసును చేధించడంలో సహకరించిన హెడ్ కానిస్టేబుళ్లు రాజా, ఎం.అంకమ్మరావు, కానిస్టేబుళ్లు షణ్ముఖరావు, ఎం.బాల కృష్ణ, రాజేష్‌ను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆరు పళ్ల విభాగంలో పాలడుగు జత ప్రథమం

నాలుగో రోజుకు జాతీయ స్థాయి ఎడ్ల పందేలు - ప్రతిభ చూపిన గుంటూరు జిల్లా ఎడ్ల జతలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం ఆరు పళ్ల విభాగంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంది 13 జతలు పోటీ పడగా గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగుకు చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, శాఖమూరి విజయ్ పవన్ కుమార్ జత 4340 అడుగుల దూరంతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పెదకాకాని మండలం, కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు, అమరావతి మండలం మనుగోడుకు చెందిన కోపూరి శ్రీనివాసరావు కంబైన్డ్ జత 4263 అడుగులతో రెండో స్థానం, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి జత 3902 దూరంతో మూడోస్థానం, తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి, కొల్లిపరకు చెందిన గుదిబండి కృష్ణ కిషోర్‌రెడ్డి కంబైన్డ్ జత 3900 అడుగుల దూరంతో నాలుగో స్థానం సాధించాయి. పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు జత 3846 అడుగులతో ఐదవ స్థానం, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన లింగా అంజయ్య చౌదరి, బాపట్ల జిల్లా పర్చూరు మండలం గంగపాలేనికి చెందిన దండు అప్పారావు, రాయుడు సుబ్బారావు జతలు 3600 అడుగులతో ఆరోస్థానం, తెలంగాణ రాష్ట్రం హైద్రాబాదుకు చెందిన డీ రోహన్‌బాబు ఎడ్లజత 3084 అడుగుల దూరంతో ఎనిమిదవ స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్ల జతల యజమానులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.శివరామప్రసాద్, ఉపాధ్యక్షులు కె.పెంటరెడ్డి, ఎన్.త్రిలోక్, కె.సుబ్బారెడ్డి, సిహెచ్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాయం కోసం రైతు చూపు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తీరా నివేదిక రూపొందించే సమయానికి నష్టం అంచనాలు సగానికి తగ్గించారు. మళ్లీ పంటల సాగుకు కనీసం ఎకరాకు రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకు నష్టపోయామని, ఒక సీజన్ పంట కూడా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక ఖరీఫ్‌లో ఒక పంటను కోల్పోయిన రైతులు రబీకి పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది రైతు భరోసా (అన్నదాత సుఖీభవ) పథకం ద్వారా పెట్టుబడి సాయం ఎప్పటికి అందుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేలు సాయం చేస్తామని ప్రకటించినా ఇంకా విధి విధానాలే రూపొందించలేదని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో అధిక వర్షాలకు నష్టపోయిన వారికి తక్షణసాయం అవసరం అంటున్నారు. రబీలో కూడా ప్రధానంగా జొన్న, మొక్కజొన్న, శనగ, మినుము,పెసర సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పంటలను కోల్పోయిన ప్రాంతాల్లో రైతులు కొంత అడ్వాన్సు రబీ సాగుకు అవకాశాలు మెరుగుపడినా తక్షణం పెట్టుబడి లేక రైతులు ఎటూ పాలుపోక దిగాలుగా ఉన్నారు. ప్రధానంగా కౌలు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. నష్టపోయిన కౌలు రైతులకు ఈ క్రాప్ నమోదు కూడా సరిగా జరగలేదని తెలిసింది. దీంతో భూ యజమానులకు పరిహారం అందే అవకాశం ఉంది.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని అధికారులకు చెప్పారు. అనంతరం అప్షన్ 3 గుత్తేదారులకు కేటాయించిన ఇళ్లు, వాటి పురోగతిపై కాంట్రాక్టర్ల వారీగా వివరాలు తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లు మాట్లాడుతూ గతంలో సరఫరా చేసిన విధంగా ఇసుక, గ్రావెల్‌ను అందించాలని, లే అవుట్‌లో చోరీల కారణంగా పోయిన మోటర్లు, ట్రాన్స్ ఫార్మర్లు వెంటనే ఏర్పాటు చేసి నిర్మాణ అవసరాలకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే స్లాబ్‌లు పూర్తయిన ఇళ్లను 15 రోజుల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. మొదటి ఫేజ్‌లో మంజూరు చేసిన 11,123 గృహాలకు గాను దాదాపు 9 వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, 500 వరకు పూర్తయ్యాయని 1200 ఇళ్ల వరకు నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందని, ఈ అంశాలను సిఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి అన్నారు.

ఆ ఎమ్మెల్యేపై దేశద్రోహం కేసు పెట్టాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - చిలకలూరిపేట : రాహుల్ గాంధీపై మహారాష్ట్రకు చెందిన శివసేన షిండే వర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ అనుచిత వ్యాఖ్యలతోపాటు రూ.11 లక్షలు రివార్డు ప్రకటించడం తీవ్రవాద చర్యని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ అన్నారు.

పాటదారులు రాక వేలం వాయిదా

ప్రజాశక్తి -పొన్నూరు

కూరగాయల మార్కెట్ ఆశీలు వసూలు హక్కు వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్ బాబు

స్థానిక కొప్పాక వెంకయ్య మున్సిపల్ కూరగాయల మార్కెట్ ఆసీలు వసూలు చేసుకునే హక్కు బహిరంగ వేలం పాట వాయిదా వేసినట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కూరగాయల మార్కెట్ ఆశీలు వసూలు చేసుకునే హక్కు వేలంపాట, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు, మార్కెట్లో స్టాల్స్, షాపులకు బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. మున్సిపల్ కూరగాయల మార్కెట్ ఆశీలు వసూలు చేసుకునే హక్కు 2025 సంవత్సరానికి మార్చి నెలాఖరు వరకు సర్కారు వారి పాట మూడు లక్షలుగా మున్సిపాలిటీ నిర్ణయించింది. అయితే కూరగాయల మార్కెట్ వేలంపాటలో పాల్గొనేందుకు పాటదారులు ముందుకు రాకపోవడంతో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కూరగాయల మార్కెట్ ముందు ఉన్న నాలుగు షాపులు, రెండు స్టాల్స్‌ను బహిరంగ వేలంలో పాటదారులు దక్కించుకున్నారు. ఇందిరా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో 3,5, 13 నెంబరు గల షాపులు పాటదారులు బహిరంగ వేలంలో పాడుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ తోట వెంకటేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన వేమారెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

అన వేమారెడ్డి ట్రస్ట్ ద్వారా గత రెండు దశాబ్దాల నుండి గుంటూరు నగరం, జిల్లాలోని రెడ్డి సమాజిక తరగతి బాలికల కోసం భోజన, వసతి గృహాన్ని ఏర్పాటు చేసి వేలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన కార్యవర్గ సభ్యుల విద్య, సామాజిక సేవలు అభినందనీయమని మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. అనవేమారెడ్డి ట్రస్ట్ నిర్వహిస్తున్న ఉడుముల కోటిరత్నం సాంబిరెడ్డి రెడ్ల బాలికల వసతి గృహంలో స్థలదాత ఉడుముల సాంబ రెడ్డి 14వ వర్ధంతి నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 57 మంది విద్యార్థినులకు రూ.10వేలు చొప్పున రూ.5.7లక్షల ఉపకార వేతనాలు, బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ రూ.లక్ష ఆర్థిక సహకారం అందించారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీలు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని వాటి సాకారం కోసం కృషి చేయాలని కోరారు. నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. సభకు చల్లా అంజిరెడ్డి అధ్యక్షత వహించగా, డాక్టర్ మోదుగుల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్.ఆర్.కే.రెడ్డి, బండి సుధావాణి అశోక్‌రెడ్డి, గాదే సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైద్య సాయం కోరుతూ లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడి వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని మంగళగిరి 12వ వార్డుకు చెందిన తమ్మిశెట్టి రమణమ్మ గురువారం ఉండవల్లిలో జరిగిన ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవించారు. పానకాల లక్ష్మీనరసింహస్వామి 3, 4 ఘాట్ రోడ్డు మలుపులకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని వెనిగళ్ల ఉమాకాంతం కోరారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు పింఛను మంజూరు చేయాలని ఉండవల్లికి చెందిన సాయమ్మ కోరారు. నిడమర్రు గ్రామంలో ఉన్న రెండెకరాల భూమికి సిఆర్‌డిఎ విచారణ పేరుతో రెండేళ్ల కౌలు నిలిపివేశారని, తనకు న్యాయం చేయాలని రెడ్డి పద్మావతి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది తమ సమస్యలు పరిష్కరించాలని లోకేష్‌కు వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు స్వీకరించిన ఆయన సమస్యల పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరు-డోన్ రైల్వే లైను మార్గంలో గురువారం సంతమాగులూరు మునమాక రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆ మార్గంలో వెళ్లిన ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు బండి క్రిందపడి మృతి చెందాడని మృతుడు కాఫీ పొడి రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి 50 నుండి 55 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండొచ్చని నరసరావుపేట రైల్వే ఎస్.ఐ టి.సుబ్బారావు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్ లో లేదా 9948525386, 9398752384 సంప్రదించాలని కోరారు.

బహిరంగ ప్రకటన

ప్రజలందరికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ షేక్ హుస్సేన్ బాష, తండ్రి. మౌలా సాహెబ్ గారు నల్లచెరువు 13వ లైను ఎదురు, మెయిన్ రోడ్డు, గుంటూరు నందు గల మొహమ్మదియ మస్జిద్ యొక్క ఆస్తులు కాపాడుటకు, మస్జిద్ యొక్క కార్యక్రమములు నిరాటంకముగా జరుగుటకు మరియు మస్జిద్ అభివృద్ధి చేయుట కొరకు ప్రజల ఆమోదముతో **"కాలాతలాబ్ మస్జిద్-ఎ- మొహమ్మదియ అభివృద్ధి సంక్షేమ సేవా కమిటి"** ని ఏర్పాటు చేసినారు. సదరు కమిటిని చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించినారు. రి.నెం.68/2022.

షేక్ అమానుల్లా, షేక్ బుడే, షేక్ ఖియాజ్ బాష మరియు వారి అనుచరులు మస్జిద్ యొక్క కార్యక్రమములకు ఆటంకము కలిగించుచున్నందున వారి పైన గౌరవ 3వ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో దావా వేసినారు. దావా నెం.502/2022. సదరు దావాలో I.A.No.187/2022 ద్వారా గౌరవ కోర్టువారు Interim Injuction ఉత్తర్వులు యిచ్చినారు. సదరు ఉత్తర్వులలో షేక్ హుస్సేన్ బాష మరియు కాలాతలాబ్ మస్జిద్-ఎ-మొహమ్మదియ అభివృద్ధి సంక్షేమ సేవా కమిటి ఆధ్వర్యంలో మస్జిద్ యొక్క అభివృద్ధి కార్యక్రమాలు చేయుటకు మరియు షేక్ అమానుల్లా, షేక్ బుడే, షేక్ ఖియాజ్ బాష మరియు వారి అనుచరులను మస్జిద్ యొక్క కార్యక్రములలో ఆటంకము చేయరాదనియు స్పష్టమైన ఆదేశాలు యిచ్చినారు.

కాని షేక్ అమానుల్లా మరియు అతని మిత్రుడు షేక్ మొహమ్మద్ రఫి (సిమెంట్ రఫి) అండదండలతో ఇద్దరు కలసి మస్జిద్ యొక్క అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకములు కలుగజేయుచున్నారు. మస్జిద్ యొక్క షాపునకు కొత్త విద్యుత్ మీటరు రాకుండా అడ్డుకున్నారు. వజుఖానా అభివృద్ధికి అడ్డుకున్నారు. బాత్రూమ్లు అభివృద్ధికి అడ్డుకున్నారు. ఇలా మాటిమాటికి పోలీసులకు కంప్లైంట్ ఇవ్వడం పని ఆపించుట తదుపరి పోలీసులు వచ్చి పరిశీలించుట అంతా సక్రమముగానే ఉన్నదని పోలీసులు సంతృప్తి చెంది పని చేసుకొనుటకు అనుమతించుట ఇలా ఎన్నో పర్యాయములు జరిగినది.

నా క్లయింట్ కమిటి వారు పండుగలకు, పర్వదినములకు మస్జిద్ సరిపోనందున మస్జిద్ అభివృద్ధి చేయవలెనని ప్రజల సూచన మేరకు మస్జిద్ యొక్క అభివృద్ధి ప్లాన్‌ను ఇంజనీర్ గారి చేత రూపొందించి ప్రజలకు చూపించి ప్రజల యొక్క ఆమోదముతో మస్జిద్ యొక్క అభివృద్ధి కొరకు మస్జిద్ విస్తృత పరచుట కొరకు మస్జిద్ కాంప్లెక్స్ లో గల షేక్ మొహమ్మద్ రఫి (సిమెంట్ రఫి) గారి సిమెంటు కొట్టును ఖాళీ చేయుట కొరకు షేక్ మొహమ్మద్ రఫి (సిమెంట్ రఫి) గారిని సంప్రదించి 2 నెలల గడువు లోపల మస్జిద్‌లో గల సిమెంటు షాపును ఖాళీ చేయమని నోటీసు ఇచ్చినారు. సదరు నోటీసు **"కాలాతలాబ్ మస్జిద్-ఎ-మొహమ్మదియ అభివృద్ధి సంక్షేమ సేవా కమిటీ** తరపున ప్రెసిడెంట్ షేక్ హుస్సేన్ బాష గారి ద్వారా పొంది ఆ విషయం మరుగుపరచి గౌరవ 3వ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు నందు O.S.No.1168/2022 షేక్ మొహమ్మద్ రఫి (సిమెంట్ రఫి) దావా వేసినారు. సదరు దావాలో షేక్ అమానుల్లా నన్ను షాపు ఖాళీ చేయమన్నాడని, లేదా నెల 1కి 20 వేలు అద్దె యివ్వమన్నాడని తప్పుడు కేసు వేసి సదరు గౌరవ కోర్టు వారిని తప్పుదోవ పట్టించుచున్నాడు. మరియు బహిరంగ ప్రకటనల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించుచున్నాడు.

1. గౌరవనీయులైన కోర్టువారు షేక్ మొహమ్మద్ రఫి (సిమెంట్ రఫి) కి ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు.
2. 2022 సంవత్సరము ఏప్రియల్ నెల నుండి 2023 సంవత్సరము జులై నెల వరకు 16 నెలల కాలములో **"కాలాతలాబ్ మస్జిద్-ఎ-మొహమ్మదియ అభివృద్ధి సంక్షేమ సేవా కమిటి"** కి నెల 1కి కేవలం 10 వేలు (అక్షరాల పదివేల రూపాయలు) మాత్రమే అద్దె చెల్లించుచున్నాడు. కాని 12 వేల రూపాయలు అని తప్పుడు ప్రకటన చేయుచున్నాడు.
3. ఈ విషయాన్ని తమ ప్లీడరు గారి ద్వారా ది. 06-09-2024వ తేదీన పేపరు పబ్లికేషన్ మరియు షాపు యందు ఫ్లెక్సి ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించుచున్నాడు.

కావున ఇటువంటి ప్రకటనలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేని యెడల నా క్లయింట్ కమిటి వారు తీసుకొనుబోవు చట్టపరమైన చర్యలకు బాధ్యుల గుదురని తెలియజేయుచున్నాము.

ఇట్లు
జి.పద్మవల్లి, అడ్వకేట్

ప్రకటన

నా క్లయింట్ చింతగుంట వెంకటకోటిరెడ్డి తండ్రి : నరసింహారెడ్డి, ఉప్పలపాడు, నరసరావుపేట మండలం కాపురస్తుడు 2016 నవంబర్ నెలలో నరసరావుపేట గ్రామంలో ఉప్పలపాడు నుండి నరసరావుపేట యూనియన్‌బ్యాంక్ లోన్ నిమిత్తం డాక్యుమెంట్ నెం. 804/1974 ఒరిజినల్ సేల్‌డీడ్ న్యూ వార్డు నెం.9, పాత సర్వే డోర్ నెం.330/2, అసెస్‌మెంట్ డోర్ నెం.1796/1 ఖాళీ స్థలం యొక్క విస్తీర్ణం 15.16553 చదరపు అడుగుల డాక్యుమెంట్‌న ఎం. 804/1974, సి.ఎస్.నెం. 1034/2012 గల డాక్యుమెంటు పోయినది. కావున పైన తెలిపిన దస్తావేజు ఎవరికైనా లభించిన యెడల మీకు అందజేయ వలసినదిగా కోరుతున్నాము. అలా అందచేసిన వ్యక్తులకు తగిన పారితోషికం ఇవ్వగలమని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయటమైనది.

ఇట్లు
ఎం.రవికాంత్,
అడ్వకేట్, నరసరావుపేట.

Court Notice
IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE(SENIOR DIVISION):: NARASARAOPET
I.P. No.4/2022

Between:
Kaniki Guru Prasad… Petitioner
And
Divyala Srinivasa Rao and Others. …Respondents

To,
R-20: Grandhi Krishna,
S/o. Venkateswarlu, R/o.
D.No: 14-1-178,LB Market centre,
VNK Road, Narasaraopet, Presently
Palnadu Dist.

పై నెంబరు ఐ.పి.ని పిటీషనరు ఇన్ సాల్వెంటుగా డిక్లేర్ చేయమని దాఖలు చేయగా సదరు పిటీషనులో 20వ రెస్పాండెంటు అయిన మీకు నోటీసులు నిమిత్తము శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది:27-09-2024కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని,మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణ లు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:27-09-2024

శ్రీ మతి.యమ్.చారులత,
పిటీషనరు తరపు న్యాయవాది,
7/1, అరండల్‌పేట, గుంటూరు.

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.పి. నెం. 66/2023

బిట్వీన్ :
చిమట శ్రీనివాసరావు .... పిటీషనర్
వర్సెస్
తెల్లగొర్ల రమేష్ మరియు 8 మంది ఇతరులు .... రెస్పాండెంట్స్

R8 : Tellagorla Vamsilal sai chaitanya yadav, S/o Singaraiah, R/o Door No. 11-28/3-69, Ramireddy Pet, Narasaraopet town & mandal, Palnadu District.

పై నెంబరు ఐ.పి.లో పిటీషనర్‌కు 1వ రెస్పాండెంట్ బాకీదారుగా వుండి ఎగ్గొట్టే నిమిత్తం తన పూర్వార్జితపు ఆస్తులను 5వ రెస్పాండెంట్ ద్వారా రెస్పాండెంట్ 2 టు 4 మరియు 6 టు 9 వారలకు బదలాయించి దివాలా కాపీ ఫైల్ చేసినందు వలన సదరు ఐ.పి.లో 8వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టువారు ది. 20-9-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో శ్రీ కోర్టువారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదాతేది :20-9-2024

ఇట్లు
దాసరి ఉదయశ్రీ
అడ్వకేట్, నరసరావుపేట.

మహారాజ రాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, రాజంపేట.
ఈపి నంబర్ : 32/23
ఇన్ ఓ ఎస్ నెంబర్ 224/15

ఎన్. చిన్న గురవయ్య. ...పిటిషన్ డిహెచ్ఆర్
వర్సెస్
కాలువ ఆనందకుమార్. ...జెడిఆర్

పైన కనపరిచిన డి హెచ్ ఆర్ జెడి ఆర్ అగు నీ పై నీ జీతమును జప్తు కోరుతూ ఈపీ దాఖలు చేసియున్నారు. ఆక్షేపణలు ఉన్న యెడల 15-10-2024 ఉదయం 10:30 నిమిషాలలో పై కోర్టులో స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా గాని హాజరై మనవి చేసుకోవాలని, లేనంతగా మీ పరోక్షమున కోర్టు ద్వారా తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
డి. కరుణాకర్ రాజు,
డిహెచ్ఆర్ ఫరం న్యాయవాది,
రాజంపేట,
అన్నమయ్య జిల్లా.

మహారాజశ్రీ ఒంగోలు రెండవ అదనపు జూనియర్ జడ్జి వారి కోర్టు, ఒంగోలు
సిసి నెంబర్ 342/2018

బిట్వీన్
పాకనాటి కృష్ణారెడ్డి .....కంప్లైయినెంట్
వర్సెస్
చిట్టేల వెంకట రమణరెడ్డి ..ముద్దాయి

To,
Sri Chittela Venkata Ramana Reddy,
S/o Narasa Reddy, R/o White rose apartment, Vijayapuri Colony,
Zero line, Near JKC College, Guntur,

పైనెంబరు కేసులో కోర్టు వారు ముద్దాయి అయిన చిట్టేల వెంకటరమణరెడ్డి గారు వ్యక్తిగత హాజరు నిమిత్తం తేది 24-09-2024కి వాయిదా వేసిఉన్నారు ఆరోజున ముద్దాయి వ్యక్తిగతంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు ఎటువంటి ఆక్షేపణలు గానీ అభ్యంతరములు గాని ఉన్న యెడల తెలియజేయుటకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది : 18-09-2024

ఇట్లు
గంటా శ్రీనివాసరావు
అడ్వకేట్, ఒంగోలు

NOTICE
IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION):: GUNTUR
A.S.NO: 114/2024

Between:
Sudha Transport Rep.by its Propritor,
D.Srnivasa Rao Appellant/D-1
And
New India Assurance Company Ltd,
Guntur Rep. by its Senior Divisional manager and Others …. Respondents

To,
R-3: Shaik Jani Basha,S/o Azeem,
Lorry Owner, R/o. Door No.19-7-532/11,
2nd Lane, Kabadi Gudem, Sangadigunta,
Guntur City, Guntur District-522003.

పై నెంబరు అప్పీలు దావా లో 3వరెస్పాండెంట్ అయిన మీకు పై కోర్టు వారి నుండి అనేక సార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసును ఈపేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 20-09-2024 కి వాయిదా వేసినారు.కావున ఆరోజునఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది: 20-09-2024

కళ్యాణం కృష్ణమూర్తి,
అప్పీలెంట్ తరపు అడ్వకేట్,
సీతారామ్ నగర్ 5వలైను,
గుంటూరు.సెల్: 94402 60914

మహారాజశ్రీ సివిల్‌జడ్జి వారి కోర్టు (జూనియర్ డివిజన్) పిడుగురాళ్ళ
ఓ.యస్. నెం. 155/2023

బిట్వీన్ :
దేవనబోయిన సైదయ్య .....వాది
మరియు
ముక్కాల కోటిరెడ్డి .... ప్రతివాది

టు :
ముక్కాల కోటిరెడ్డి తండ్రి : నాగిరెడ్డి, వయస్సు 46 సం॥లు, వ్యాపారం, నివాసం : కామేపల్లి గ్రామం, పిడుగురాళ్ళ మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాను వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దావా వేసియున్నాడు. సదరు దావాలో కోర్టువారు మీకు పలుమార్లు సమన్లు పంపినను, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పైన తెలిపిన దావాలో మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనుటకు కోర్టువారు ది. 27-9-2024న వాయిదా వేసివున్నారు. వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియపర్చగలరు. లేనియెడల సదరు దావాను మీ పరోక్షంగా తీర్మానించబడునని తెలియ పర్చుటమైనది.

వాయిదాతేది : 27-9-2024
తేది: 19-9-2024
పిడుగురాళ్ళ.

వాది తరపు న్యాయవాది,
ఎన్.ప్రశాంత్ నాయక్,
పిడుగురాళ్ళ.

TIRUMALA ENGINEERING COLLEGE
AUTONOMOUS
(Approved by A.I.C.T.E NEW DELHI & Affiliated to JNTU, KAKINADA)
ISO 9001:2015 Certified Institution, Accredited by NAAC & NBA
JONNALAGADDA, NARASARAOPET-522601, PALNADU (DT)
Phone No: 9248752999, 7013777374, 9133300228

SPOT ADMISSIONS FOR APEAPCET -2024

Applications are invited from eligible candidates for admission into the 1st B.Tech course under Category-A seats (Non-Reporting / Dropouts / Unfilled seats).**Vacancies in Courses: ECE, EEE, CSE, CSE-CSM, and INF.** The admissions will be made as per the guidelines issued by the **Chairman & Competent Authority, APSCHE**.Interested and eligible candidates can attend the spot admissions at college office on or before **24-09-2024 at 11.00 AM**

Dr.Y.V.Narayana, Principal. Sri R.Satya Narayana, Secretary& Correspondent

రషీద్ హత్య కేసుపై వినుకొండ కోర్టులో పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు

షమీంఖాన్, ఆయూబ్‌ఖాన్‌ను నిందితులగా చేర్చాలని డిమాండ్

ప్రజాశక్తి - వినుకొండ

రషీద్ హత్య కేసులో షమీంఖాన్, ఆయూబ్‌ఖాన్లను నిందితులుగా చేర్చాలని వైసిపి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, లీగల్ సెల్ బాధ్యులు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. టిడిపి నాయకుల ప్రోత్బలంతోనే రషీద్ హత్య జరిగిందని ఆరోపిస్తూ సోదరుడు ఖాదర్ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వేసిన పిటిషన్‌పై తన వాదనను వినిపించేందుకు సుధాకర్‌రెడ్డి గురువారం వినుకొండ కోర్టుకు వచ్చారు. వాదనల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రషీద్ కుటుంబానికి న్యాయ సహాయం చేసేందుకు వచ్చానని తెలిపారు. హత్యకు వెనుక ఉండి నడిపించిన వ్యక్తులను వదిలేసి పోలీసులు తప్పు చేశారు కాబట్టే కోర్టులో పిటిషన్ వేశామన్నారు. వైసిపి కార్యకర్తలకు న్యాయపరంగా ఎటువంటి ఇబ్బంది జరిగినా పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట న్యాయవాదులు చెన్నకేశవరెడ్డి, ఎంఎన్ ప్రసాద్ ఉన్నారు.

అనంద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సిస్టర్ తుమ్మ సుజాత

సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు మాచర్ల సెయింట్ ఆన్స్ విద్యార్థి

ప్రజాశక్తి- మాచర్ల

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మాచర్ల పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థి అగస్త్య ఆనంద్ ఎంపికయ్యారు. ఈనెల 15,16 తేదీలలో అనంతపురంలోని ఎస్‌కె యూనివర్సిటీలో ఉమ్మడి 13 జిల్లాల సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. వివిధ జిల్లాల నుండి సుమారు 250 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి ఎ.అగస్త్య ఆనంద్ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. నవంబర్ 8 నుండి 12వ తేదీల్లో జమ్మూకాశ్మీర్లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో అగస్త్య ఆనంద్ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా అగస్త్య ఆనంద్‌ను ప్రిన్సిపల్ సిస్టర్ తుమ్మ సుజాత గురువారం ప్రత్యేకంగా అభినందించారు. చదువుతోపాటు ఆటల్లో రాణిస్తూ స్కూలుకు, తల్లిదండ్రులకు, రాష్ట్రానికి మంచి పేరు తెస్తున్నాడని, జాతీయ స్థాయిలోనూ మంచి ప్రదర్శన కనపర్చి మనమంతా గర్వపడేలా ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. అభినందనలు తెలిపిన వారిలో పిఇటి మత్తే కుమార్, ప్రతాప్, ఉపాధ్యాయులు సంతోష్, ప్రకాష్, వెంకట్, వినేష్ , షార్ రాజు, వరప్రసాద్, నాగేశ్వరరావు, మణికంఠ ఉన్నారు.

చుక్కల భూములపై పున:పరిశీలన

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలో ఫ్రీ హోల్డ్ చేసిన చుక్కల భూములు, అసైన్మెంట్ భూముల వివరాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కుమోదిని సింగ్ గురువారం పున:పరిశీలించారు.

రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

ఆమెవెంట డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరావు, సబ్‌రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ దానియేలు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం కోసం రైతుసంఘం వినతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

అన్నదాత సుఖీభవ పథకం కింద కూటమి ప్రభుత్వం ప్రకటించిన రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతుసంఘం కోరింది. ఈ మేరకు సంఘం పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి డి.శేషారావు, రైతులు కలిసి తహశీల్దార్ దానియేలుకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. శేషారావు మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాల వల్ల నియోజకవర్గంలోని అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, పెదకూరపాడు మండలాల్లోని పత్తి రైతులు, అపరాలు, ఇతర పంట రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పెట్టుబడి సహాయం వెంటనే అందిస్తే రైతులకు మేలు జరుగుతున్నారు. వరదలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే దాన్ని రూ.20 వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, పి.వెంకట్రావు, సురేష్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అటుగా వెళ్తే వంటికి మురికే

ప్రజాశక్తి - నాదెండ్ల

మండల కేంద్రమైన నాదెండ్ల ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. వాహన రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే మార్గంలో గుంతలు పడి నిలిచిన మురుగు నీటి వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు, పాదచారులు వెళ్తున్నప్పుడు మురుగు నీరు పడుతూ బట్టలు పాడవుతున్నాయని, దుర్వాసన వస్తోంది. తిమ్మాపురం జాతీయ రహదారి నుండి గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మీదుగా సాతులూరు వరకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులూ నిత్యం వచ్చిపోతుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రహదారిపై దుస్థితిని తొలగించడానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయినులకు కోలాహలంగా క్రీడలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో ఉపాధ్యాయినులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎం ఎల్.ధనలక్ష్మి, మొర్జంపాడు హైస్కూల్ హెచ్‌ఎం పద్మాబాయి, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు భాగేశ్వరిదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయకమల ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో పలు పాఠశాలల నుండి ఉపాధ్యాయినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్నింగ్ రేస్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ తదితర విభాగాల్లో పోటీపడ్డారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ సారధి, నాయకులు జమాల్, వి.నాగేశ్వరరావు, ఆనంద్ కుమార్, శ్రీనివాసరావు, సాంబశివరావు సాయిబాబా, మస్తాన్‌వలి పర్యవేక్షించారు.

మండల స్థాయిలో తలపడ్డ క్రీడాకారులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని జెడ్‌పి పాఠశాల, జిఆర్‌సికె పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం కె.వెంకటరమణ, జిఆర్‌సికె డైరెక్టర్ రాము మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారానూ మంచి భవిష్యత్‌ను పొందొచ్చని చెప్పారు. క్రీడల నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు అచ్చంపేట, క్రోసూరులో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సాంబశివరావు, పిఇటిలు అరుణశ్రీ, పూర్ణ, అజయ్ పాల్గొన్నారు.

సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : నాగార్జున సాగర్ కుడికాల్వ పరిధిలో ఉన్న సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అబ్బూరు గ్రామ సిపిఎం శాఖ మహాసభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు విధానాన్ని రద్దు చేయాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలని, గ్రామాల్లో చెత్త సేకరణ చేపట్టాలని తీర్మానించారు. అనంతరం నూతన కార్యదర్శిగా కట్టా మాధవిని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి పి.మహేష్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2024పై కలెక్టర్లతో సిఎస్ సమీక్ష

విసిలో జిల్లా కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వర్ణాంధ్ర-2024 కార్యక్రమంపై విజన్ డాక్యుమెంట్ ప్రిపరేషన్ గురించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తన క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లతో గురువారం సమీక్షించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ పి.అరుణ్‌బాబు పాల్గొన్నారు. మండల స్థాయి ప్రణాళిక ఈ నెల 30 నాటికి, జిల్లా స్థాయి ప్రణాళికలను వచ్చే నెల 15 నాటికి పూర్తి చేయాని, మండల స్థాయి నుండి జిల్లా స్థాయిలలో గ్రామ సభలు నిర్వహించాలని నీరబ్‌కుమార్ ఆదేశించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో ఆయా శాఖలకు సంబంధించి నిర్వహించ తలపెట్టిన అభివద్ధి కార్యక్రమాలు వివరాలను రూపొందించి నివేదికలు అందజేయలన్నారు. తదనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించుకోవాలని చెప్పారు. గ్రామ సభల్లో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మధుబాబు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి- మాచర్ల : విజయవాడ వరద బాధితులను ఆదుకోవటానికి తన వంతు సహాయంగా రూ.10 లక్షల విరాళాన్ని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు అందించారు. నియోజకవర్గ నాయకులతో కలిసి మధుబాబు రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబుకు చెక్కును గురువారం ఇచ్చారు. కార్యక్రమంలో డి.జానకీరామయ్య, వై.వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసరావు, ఎల్.బ్రహ్మయ్య, ఎం.రామలక్ష్మయ్య, టి.వెంకటేశ్వర్లు, షేక్ మోసిన్, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విధుల్లోకి పల్నాడు ఎఎస్‌పి సంతోష్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా జెవి.సంతోష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో నంద్యాల జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా పనిచేసి ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. నూతన ఎఎస్పీని పలువురు జిల్లా పోలీసు అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హాయ్‌ల్యాండ్ రోడ్డులో అంధకారం

- వీధిదీపాలు లేక ఇబ్బందులు
- ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలు
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం చినకాకాని లోని హాయ్ ల్యాండ్ కు వెళ్లే రహదారిలో లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నివసించేవారు, రాత్రుళ్ల వివిధ పనులపై ఇటుగా రాకపోకలు సాగించేవారు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. అంధకారం నేపథ్యంలో ఆకతాయిలు ఇదే మార్గంలో మద్యం సేవించి సీసాలను ఇక్కడే పడేస్తున్నారు. మహిళలు, విద్యార్థినీలు రాకపోకలు సాగించే సమయంలో పలు సందర్భాల్లో ఆకతాయిలు టీజ్ చేస్తున్నారని, స్థానికులు వాపోతున్నారు. లైట్లు ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ అధికారులను అడిగితే ఇది తమ పరిధిలోకి రాదని విద్యుత్ శాఖ అధికారుల ఆధీనంలో ఉందని తెలిపారని, విద్యుత్ శాఖ అధికారులను అడిగితే హాయ్ ల్యాండ్ యాజమాన్యం స్పందించాలని తమకు సంబంధం లేదని చెప్పారని ప్రజలు పేర్కొన్నారు. ఇలా ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుని తమ సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని సమీపంలో నివసించే ప్రజలు అపార్ట్మెంట్లలో ఉండేవారు వాపోతున్నారు. గత కొద్ది రోజుల క్రితం ఇటుగా ఓ మహిళ వెళుతుండగా మెడలో నుండి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గొలుసును తెంచుకొని పరారైనట్లు తెలిపారు. చీకట్లో ఇటుగా వెళ్లాలంటే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే మహిళ ఉద్యోగినీలు వారాంతపు సెలవు దినాల్లో తమ ఇళ్లకు వచ్చేందుకు రాత్రి వేళల్లో బస్సు దిగి ఇంటికి చేరుకోవాలంటే ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి హాయ్‌ల్యాండ్ రోడ్డులో వీధి దీపాలను వెలిగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పేదలకు గృహాలను మంజూరు చేయండి

మంత్రి కొలుసు పార్థసారధిని కోరిన ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వెను కబడిన మేదర, రజకులకు పీకల వాగు కట్ట మీద నివసిస్తున్న పేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథిని ఎమెల్యే గళ్ళా మాధవి కోరారు. గురువారం గుంటూరు పర్యటనకు వచ్చిన మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే నివాసంలో తేనీటి విందుకు హాజరయ్యారు. నియోజకవర్గంలో వెనుకబడిన మేదర ,రజకులకు పీకల వాగు కట్ట మీద నివసిస్తున్న పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పార్థ సారథిని ఆమె కోరారు. సీతమ్మ కాలనీలో 43 చెంచు కుటుంబాలు వెంకటరమణ కాలనీలో మేదర, రజక కుటుంబాలు 15 వరకు ఉన్నాయని వీరికి సొంత గృహాలు లేవని మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. నల్లచెరువు 18 నుండి 25 లైన్లు, నంబూరు సుభాని కాలనీలో సుమారు 110 మేదర కుటుంబాలు చుట్టుగుంట మరియు పీకలవాగు పరిసరాలలో 60 కుటుంబాలకు సొంత గృహాలు లేవన్నారు. కొన్ని కుటుంబాలు పీకల వాగు కట్టమీద మరియు డ్రైనేజీ కాలువల మీద ఇళ్ళు నిర్మించుకొని ఉంటున్నారు. దీని వలన వర్షాకాలంలో వీరి ఇల్లు ముంపునకు గురై, రోగాలు ప్రబలి అనారోగ్యానికి గురై, మహిళలు, పిల్లలు తీవ్రంగా ఇబ్బందులు గురవుతున్నారని, కొన్నిసార్లు ప్రమాదవశాత్తు పీకల వాగులో పిల్లలు కొట్టుకుపోయిన ఘటన కూడా ఉన్నదని, వీరందరికీ అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్యే గళ్ళ మాధవి ఇచ్చిన ప్రతిపాదనలకు మంత్రి కొలుసు పార్థసారథి సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు మంత్రి పార్థసారధిని గల్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావు ఘనంగా సన్మానించారు.

మంత్రిని సన్మానిస్తున్న గల్లా మాధవి, రామచంద్రరావు

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

డ్రైన్లపై, రోడ్లపై ఆక్రమణల వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు, మురుగు పారుదల లేక తీవ్ర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, కావున ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి గురువారం లాలాపేట మెయిన్ రోడ్డు, పట్నం బజార్‌లో రోడ్డు, డ్రైన్ల ఆక్రమణ తొలగింపు పరిశీలించి, స్థానిక వ్యాపారులకు ఆక్రమణల తొలగింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రైన్లపై ఆక్రమణల వలన వ్యర్థాలు అడ్డుపడి వర్షం నీరు రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి వెళ్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందుల దష్ట్యా డ్రైన్లపై ఆక్రమణలను తొలగించటానికి సహకరించాలని కోరారు. ఇప్పటికే నగరంలో ఐటిసి ఎదురు జిటి రోడ్, ఓల్డ్ క్లబ్ రోడ్‌లో ఆక్రమణలను తొలగించామన్నారు. రాబోయే కాలంలో నగరంలోని అన్ని ప్రాంతాల్లో డ్రైన్ల ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆక్రమణదారులకు ముందుగా అధికారులు అవగాహన కల్పించటం, పట్నం బజార్‌లో పలువురు ముందుకు వచ్చి ఆక్రమణల తొలగింపునకు సహకరిస్తున్నందుకు అభినందనీయం అన్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు దుకాణం ముందు రోడ్ మీద సరుకులు పెట్టకుండా సహకరించాలని కోరారు. త్వరలో పట్నంబజార్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటుగా ప్యాచ్ వర్కులు చేపట్టడం జరుగుతుందన్నారు.అనంతరం పూల మార్కెట్ నుండి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు చేపట్టిన బిటి రోడ్ నిర్మాణ పనులను కమిషనర్, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్.ఈ. శ్యాంసుందర్, ఎంహెచ్ఓలు మధుసూదన్, రామారావు, కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టి, సంకూరి శ్రీనివాసరావు, ఈరంటి వరప్రసాద్, ఈఈ కోటేశ్వరరావు, డిసిపి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్, ఎమ్మెల్యే

దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్రమంత్రి రతన్‌సింగ్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - తెనాలి

రాహుల్ గాంధీ పై కేంద్రం సహాయ మంత్రి బట్టు రతన్ సింగ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రతన్ సింగ్ వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టి బొమ్మను స్థానిక బోస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు దారా రామకష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దిగజారుడు రాజకీయ విమర్శలు తగదన్నారు. కార్యక్రమంలో తెనాలి, వేమూరు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నన్నపనేని రాజకుమారి

77 ఏళ్ల వయస్సులో కోర్టుకు రావడం బాధాకరం

టిడిపి సీనియన్ నాయకులు నన్నపనేని రాజకుమారి

ప్రజాశక్తి - మంగళగిరి

గత ప్రభుత్వ నీలి నీడలు మమ్మల్ని వెంటాడుతున్నాయని టిడిపి సీనియర్ నాయకురాలు నన్నపనేని రాజకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మంగళగిరి కోర్టులో గత వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో కోర్టుకు హాజరయ్యారు. అనంతరం మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అనుకోని విపత్తు ఏర్పడినప్పుడు. ఏ ముఖ్యమంత్రి కష్టపడని విధంగా నారా చంద్రబాబు నాయుడు కష్టపడ్డారని అన్నారు. నారా లోకేష్ మంగళగిరి నియోజక వర్గ ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని అన్నారు.గత ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు ఘోరంగా ఓడించినా చింతా చచ్చిన పులుపు చావలేదు అన్న చందంగా జగన్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం ఐక్యతగా పని చేస్తుందన్నారు. ఏ తప్పు చేయకుండానే మంగళగిరి కోర్టుకు తిరగాల్సి రావటం బాధాకరంగ ఉందని 77 ఏళ్ల వయసులో కోర్టుకు వెళ్ళటం రావటం ఇబ్బంది గానూ, వేదన కలిగిస్తుందని అన్నారు.నా లాంటి బాధితుల ఆవేదన మేరకే రెడ్ బుక్ అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రానున్న రోజుల్లోరాజధాని అభివృద్ధి చెందితే లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నందం అబద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

పొనుగుపాడు సచివాలయ అధికారికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పంట దెబ్బతిన్న రైతుల్ని ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

రైతు, కౌలురైతులకు అన్నదాత పెట్టుబడిసాయం రూ.20వేలు ఇవ్వాలని రైతు, కౌలురైతు సంఘం నాయకులు కోరారు. ఈమేరకు పొనుగుపాడులో సచివాలయ అధికారి అరుణకు నాయకులు ఎర్రమాసు కృష్ణ, ధూళిపాళ్ల పోతురాజు, పచ్చ చంద్రమౌళి, షేక్ హుస్సేన్, వై రత్నకుమారి, సూర్యనారాయణ వినతి పత్రం అందజేశారు. వినతి పత్రంలో భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.2లక్షల వరకు రైతుల రుణమాఫీ చేయాలని, కౌలు రైతులను వారి పంటలను ఈ-క్రాప్ నమోదు చేయాలని కోరారు. అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్ల వద్దని, జీవో 22ను రద్దు చేయాలని, కౌలు రైతులకు రైతుల పంటలకు ఉచిత బీమా కల్పించాలని కోరారు.

27న గుంటూరులో జాషువా జయంతి

ప్రజాశక్తి - తాడేపల్లి

ఈనెల 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, ప్రజానాట్యమండలి, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 129వ జయంతి నీ గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నారని ఎం రవి, వల్లభాపురం వెంకటేశ్వరరావులు తెలిపారు. గురువారం ఉండవల్లిలో ప్రజాసంఘాల నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు జాషువా జయంతి సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త పలు పురస్కారాలు అందుకున్న డాక్టర్ గుమ్మ సాంబశివరావు, పాడుదమా స్వేచ్ఛా గీతం, ఎగరేయుద మా జాతి పతాకం అంటూ ప్రజలలో దేశభక్తి భావాన్ని నింపడమే గాక, అభ్యుదయ సాహిత్యాన్ని సమాజానికి అందించిన అభ్యుదయవేత గంటేడ గౌరు నాయుడు లకు 2024 గుర్రం జాషువా కవితా పురస్కార ప్రధాన ఉత్సవం ఉంటుందని అన్నారు. శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు బాలసుబ్రమణ్యం , ఎం వి ఎస్ శర్మ గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రవి, వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కరపత్ర ఆవిష్కరణలో ప్రజాసంఘాల నాయకులు ఈమని రామారావు, సిహెచ్ సుందర్రావు, సైకం వెంకటనారాయణ, ఉండవల్లి పార్థసారథి, పలకలూరి గాంధీ, పి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు

ఉండవల్లిలో కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

27న గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జాషువా కవితా పురస్కార ప్రధాన ఉత్సవం, సదస్సును జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రచార కరపత్రాల ఆవిష్కరణలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రజలు, సాహితీ అభిమానులు, అభ్యుదయ వాదులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పెదనందిపాడులో కరపత్రాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు, కో కన్వీ నర్ కొత్త వెంకటశివరావు, చుక్కా యానాదులు పాల్గొన్నారు.

ఐదు వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి : ఉండవల్లి సెంటర్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 16వ గణేష్ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఐదు వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు లింగంశెట్టి కిషోర్ మాట్లాడుతూ ప్రజల మద్దతుతో గణేష్ ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించగలుగుతున్నామని చెప్పారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి వరుసగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆదరణతో భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.

జీఓ 115ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జీవో నెంబర్ 115 రద్దు చేయాలని, ఉద్యోగ క్రమబద్ధికరణ చేయాలని కోరుతూ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు డిమాండు చేస్తూ సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. స్టాఫ్ నర్సుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇచ్చి ఏఎన్ఎం లను జిఎన్ఎంలుగా చేస్తున్నారని, దానివల్ల జిఎన్ఎంలుగా ఉన్న తాము చాలా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్స్‌లో సంవత్సరాల తరబడి చేస్తున్న తాము చాలా నష్టపోయామన్నారు. కూటమి ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ -14 , 17 బాలబాలికల ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ పోటీ జట్లు ఎంపికలు శనివారం నిర్వహిస్తారని ఎంఇఓ ఎ.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. అదేవిధంగా అథ్లెటిక్స్, చెస్, యోగా క్రీడా పోటీలు మండల జట్ల ఎంపికలు సోమవారం నిర్వహిస్తామన్నారు. క్రీడల సమన్వయకర్తగా నందిగామ వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్.పిచ్చయ్య వ్యవహరిస్తారని అన్నారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు తెలిపారు. గురువారం ఉదయం పట్టణంలో సిబ్బంది చేపట్టిన పారిశధ్యం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ ప్రజారోగ్యం మెరుగుపడేందుకు పరిసరాల పరిశుభ్రతను పాటించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణంగా పారిశుధ్య పనులు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గోన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కమిషనర్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును చిలకలూరిపేట మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.హరిబాబు గురువారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. మున్సిపల్ కమిషనర్ హరిబాబు గతంలో అనంతపురం కార్పోరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా పని చేసి బదిలీలలో భాగంగా చిలకలూరిపేట కమిషనర్‌గా వచ్చారు. ఈయన గురువారం విధుల్లో చేరి ఆ తరువాత పుల్లారావును కలిశారు. కార్యక్రమంలో చైర్మన్ ఎస్.కె.రఫాని, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ గంగ శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు మదన్ మోహన్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తామని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో 40లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం వ్యవస్థలను సర్వనాశనం చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను త్వరలో అమలు చేస్తామని చెప్పారు. 100రోజుల పాలన పై కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి ప్రజలకు వివరిస్తామని చెప్పారు. రూ.15లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బలిజేపల్లి రమాదేవి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు టిడిపి నాయకులు ఆళ్ళ సాంబయ్య, లగడపాటి గజానన, మందడపు సాంబశివరావు, మక్కపాటి రామచంద్ర రావు చౌట శ్రీనివాసరావు బిజేపి నేతలు కట్టా శంకరరావు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఆగిన కందిపప్పు

ప్రజాశక్తి - రెంటచింతల

అంగన్వాడీ కేంద్రాలకు రెండు నెలలుగా కందిపప్పు సరఫరా ఆగిపోయింది. దీంతో పప్పు లేకుండానే మధ్యాహ్న భోజనం పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. గత వైసిపి ప్రభుత్వం హయాంలో తూకంలో తేడాలు, ప్యాకెట్ల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశించడంతో కందిపప్పు సేకరణ ఆగిపోయింది. మాచర్లనియోజకవర్గంలో 267 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆరు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 14,923 మంది, గర్భిణులు 2105 మంది, బాలింతలు1874 మంది ఉన్నారు. వీరందరికీ కందిపప్పు లేకుండానే మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్నారు. నీళ్ళతో కూడిన కూరలు తినలేక అవస్థలు పడుతున్నారని పిల్లలు, బాలింతలు, గర్భిణిలు వాపోతున్నారు. చాలామంది అన్నం కంచాల్లోనే వదిలేసి వెళుతున్నారని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. గర్భిణులు, బాలింతలకు ఒక్కొక్కరికి రోజుకు 125 గ్రాముల అన్నం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల నూనె అందించాల్సి ఉంది. అలాగే చిన్నారులకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, ఐదు గ్రాముల నూనె ఇవ్వాలి. కూరగాయలకు రూ.రెండు చొప్పున కేటాయిస్తున్నారు. పప్పులేకుండా భోజనం చేయడానికి నిరాసక్తత చూపిస్తున్నారు. దీనిపై అధికారులకు విన్నవించినా కొద్ది రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని, అప్పటిదాకా సద్దుకోవాలని నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

పుట్టిన బిడ్డకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

పుట్టిన బిడ్డకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలని జిల్లా స్టాటిస్టికల్ అధికారి నీలకంఠేశ్వరావు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా అధికారుల బృందం గురువారం తనిఖీ చేశారు. జిల్లా స్టాటిస్టికల్ అధికారి నీలకంఠేశ్వరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉన్నూరుభాషా, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి సురేఖలు మాతా శిశు సంరక్షణ సేవలు ఆర్సీహెచ్ పోర్టల్ అన్‌లైన్ సేవలను పరిశీలించారు. అనంతరం సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించాలని రక్త హీనత లేకుండా పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించాలని, వారికి ప్రతి నెలా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి మీనాక్షమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారి పి.శ్రీనివాసరావు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి ప్రధాన రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గత ప్రభుత్వంలో రహదారుల రక్షణకు చర్యలు చేపట్టక పోవడంతో మాచర్ల ప్రధాన రహదారుల వెంబడి ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ఆ రహదారి మీదుగా వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఏళ్ళు గడుస్తున్నా రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించలేదు. దీనికి తోడు రోడ్లు కూడా గుంతలమయంగా మారడంతో ఇటీవల మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి చొరవతో చింతలతాండ నుంచి మాచర్లకు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టారు. కొత్తపల్లి నుంచి మాచర్ల వెళ్లే రహదారి మరమ్మతు పనులు జాతీయ రహదారి పనులు పూర్తవగానే ప్రారంభిస్తారు. ఇప్పటికే రూ.31 కోట్లతో సాగర్-మాచర్ల (వయా చింతల తండా) మీదుగా వెళ్లే రహదారిని డబుల్ లైన్‌గా మార్చేందుకు ఎమ్యెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాలతో అధికారులు ప్రతిపాదనలు పంపారు.

ఆటల పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాలలో మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగ పోటీలను గురువారం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎన్.రామకష్ణారెడ్డి తెలిపారు. ఈ పోటీలను ఎంఈఓ రామతులసి ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాల నుండి బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొనగా మండల స్థాయి జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనానున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోటీల ఆర్గనైజేషన్ సెక్రెటరీ మద్దం వెంకటేశ్వర్లు, వైవి చిరంజీవి, కె.యేసు రాజు, రూత్ మేరీ, కె.వెంకట గోపి, కె.శ్రీహరి, కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెంటచింతలలో 36.6 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - రెంటచింతల

తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యే ప్రాంతం రెంటచింతలలో గత కొద్ది రోజుల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గురువారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 36.6 డిగ్రీలుగా నమోదయింది. ఎండ తీవ్రత వల్ల చెమట రూపంలో రెండున్నర నుంచి మూడు లీటర్ల వరకు నీటిని కోల్పోయే పరిస్థితి వస్తోంది. దీనివల్ల ఆరోగ్యంపై ప్రతికూలత ఏర్పడే ప్రమాదం ఉంది. మహిళల్లో రోగనిరోధక శక్తి కూడా తగ్గటంతో పాటు చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

'కాంగ్రెస్‌లో వైసిపి విలీనం తథ్యం'

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర చరిత్రలోనే చెరగని సంక్షేమ సంతకం చేస్తున్న కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనతో విపక్ష వైసిపి దిక్కుతోచని స్థితిలో పడిందని, ఆ పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనం ఖాయంగా కనిపిస్తుందని ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు గురువారం పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి వందరోజుల పూర్తవుతున్న నేపథ్యంలో గుంటూరు, తన నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్డీయే కూటమి 100 రోజుల పాలన అద్భుతంగా ఉందని, ప్రజలు శభాష్ అంటుంటే జగన్, వైసిపి నేతలు జీర్ణించుకోలేక అవస్థపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'ఈ ప్రభుత్వం మాది' అని ప్రజలంతా అనుకునేలా తమ ప్రభుత్వం 100 రోజుల పాలన సాగిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఫించను రూ.వెయ్యి పెంచారని, మొదటి నెలలోనే 3 నెలల బకాయిలు కలిపి ఇచ్చారని, ప్రతినెలా 1వ తేదీనే ఇళ్ల వద్దకు రూ.నాలుగువేలు ఫించను ఇస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షలమందికి ఏకకాలంలో పంపిణీ చేస్తున్నారన్నారు. రామలక్ష్మణులాగా సమన్వయంతో పనిచేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దెబ్బతో వైసిపి మొత్తం తట్టాబుట్టా సర్దుకునే పనిలో పడిందని విమర్శించారు. ఆ పార్టీలో కీలక నేతగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి తర్వాత ఆ పార్టీ పతనం మరింత వేగం పుంజుకోవడం ఖాయమన్నారు. బాలినేని బాటలోనే ఇంకా చాలామంది నాయకులు ఎవరిదారి వారు చూసుకుంటున్నారని, వైసీపీకి మనుగడ లేదని, అక్కడ ఉంటే ఉనికికే ప్రమాదమని వాళ్లంతా ఒక నిర్ణయానికి వచ్చేశారని అన్నారు. రానున్న 15 సంవత్సరాల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో అద్భుతమైన రాష్ట్రంగా ఏపీ అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలోనే ఏపీ ఒక ఆదర్శంగా నిలబడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎంపిడిఓ కె సరోజినీదేవి అన్నారు. మండల పరిధిలోని తాళ్ళపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో జరిగిన స్వచ్చతాహీ సేవా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఎంపిడిఓ కె.సరోజినీదేవి మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. తద్వారా ప్రజలు విష జ్వరాల బారిన పడరని వివరించారు. విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచి పసుపులేటి బ్రహ్మయ్య, విస్తరణ అధికారి కోటేశ్వరరావు, హెచ్ఎం శ్రీనునాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో అడ్డగోలు వ్యాపారాలు

- ఎమ్మార్పీలకు మించి విక్రయాలు
- నిలువు దోపిడీకి గురవుతున్న ప్రయాణీకులు

ప్రజాశక్తి - తెనాలి

ఆర్‌టిసి బస్టాండుల్లో ప్రయాణీకుల అవసరాలను అడ్డుపెట్టుకుని వ్యాపారులు అడ్డగోలుగా దోచేస్తున్నారు. తినుబండారాలను ఎమ్మార్పీ ధరకు మించి విక్రయిస్తున్నారు. కూల్ డ్రింక్స్ మొదలు, పిల్లల స్నాక్స్ వరకూ ఇదే పరిస్థితి. ఇక కూల్ డ్రింక్ షాపుల్లో బేకరి ఐటెమ్స్ కూడా విక్రయించేస్తున్నారు. వీటిపై ధర ఉండదు. తయారీ తేదీ, ఇతర వివరాలేమీ ఉండవు. ఇలా ప్రయాణీకులు నిలువు దోపిడీకి గురౌతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

తెనాలి స్థానిక ఆర్టీసి బస్టాండ్ నుంచి విజయవాడ, మంగళగిరి, కొల్లిపర, గుంటూరు, రేపల్లె, చెరుకుపల్లి, పొన్నూరు, బాపట్ల, తదితర ప్రాంతాలకు ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఆర్టీసి పరిధిలో లీజు పద్ధతిలో వ్యాపారులు వివిధ రకాల షాపులు నిర్వహిస్తుంటారు. వారు చేసే వ్యాపారాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత అర్టీసి అధికారులతో పాటు లీగల్ మెట్రాలజీ అధికారులపై ఉంటుంది. అయితే వారి పర్యవేక్షణ కొరవైందో ఏమో గానీ వ్యాపారులు ప్రయాణీకులను దోచేస్తున్నారన్న విమర్శ బలంగా వినిపిస్తున్నాయి. హడావుడీ ప్రయాణంలో బస్సు వెళ్ళిపోతుందన్న తొందరపాటులోనో, పిల్లలు గోల చేయడంతోనో బస్టాండు ప్రాంతంలో తినుబండారాలు కొనే ప్రయాణికులకు వ్యాపారుల దగ్గర మోసపోవడం తప్పడం లేదు. రూ.పది వస్తువును అమాంతంగా రూ.15 అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అడిగిన వారిపై అక్కసు వెల్లగక్కుతున్నారు.

ఫ్రిడ్జీలో అమర్చి ఉన్న స్థానిక బ్రాండ్లు

కంపెనీ లేబుల్ లేని జ్యూస్ బాటిల్

ఎమ్మార్పీ ధరకు మించి విక్రయాలు

కూల్ డ్రింక్ పెట్ బాటిల్ ఎమ్మార్పీ ధర రూ.20 ఉంటే రూ.22 నుంచి రూ.25వరకూ విక్రయిస్తున్నారు. బేకరీ ఫుడ్స్ ప్లెయిన్‌కేక్, చిప్స్, ఇతర తిను బండారాలు కేవలం ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేసి విక్రయించేస్తున్నారు. దానిపై ధర ఉండదు, తయారీ, ఎక్సపయిరీ తేదీ, బరువు, బ్యాచ్ నెంబర్ వంటివి ఉండవు. దీంతో వ్యాపారులు చెప్పిందే ధర. ఇంకో విషయం ఏమిటంటే సొంత తయారీలో బాదంపాలు విక్రయిస్తారు. వివిద కూల్ డ్రింక్ కంపెనీలు పెట్ బాటిల్‌గా ఉపయోగిస్తున్న బాటిల్ కంటే చిన్న సైజు బాటిల్‌లో నింపుతున్నారు. పెట్ బాటిల్ కంటే తక్కువ మోతాదే. బాటిల్‌పై ధర కాని, తయారీ తేదీ, క్వాంటిటీ కానీ ఉండవు. కానీ ఏకంగా ప్రయాణీకులు ముక్కుపిండి మరీ రూ.30 వసూలు చేస్తున్నారు. దీనిని కట్టడి చేయాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఫిర్యాదులు వస్తే కచ్చింతంగా స్పందిస్తాం

ఐజె ప్రసాద్, ఆర్టీసీ సిఐ, తెనాలి డిపో

ఆర్టీసి కాంప్లెక్స్‌లో కొన్ని షాపులు వ్యాపారాల నిమిత్తం లీజుకిచ్చాం. మరికొన్ని లీజుకు ఇవ్వాల్సి ఉంది. అయితే వారు నిర్వహించే వ్యాపారాలలో అదనపు ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం ఇచ్చినా, ప్రయాణీకుల నుంచి ఫిర్యాదు వచ్చినా ఖచ్చింతంగా స్పందిస్తాం. తక్షణమే తనిఖీలు చేపడతాం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

శేషసాయి, లీగల్ మెట్రాలజి డివిజినల్ ఇన్‌స్పెక్టర్, తెనాలి.

ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ప్రస్తుతం ఆయిల్ కంపెనీలపై దాడులు కొనసాగుతున్నాయి. ఇంపోర్ట్ డ్యూటీ పెరిగిన నేపథ్యంలో పాత స్టాక్‌ను కొత్త రేట్లకు విక్రయిస్తున్నారు. పామోలివ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్స్ విక్రయాలపై ఐదు కేసులు నమోదు చేశాం. ఆర్టీసి బస్టాండులోనూ తనిఖీలు చేపడతాం. నిబంధనలు పాటించని వ్యాపారులపై తగిన చర్యలు తీసుకుంటాం.

బీసీల డిమాండ్లపై దృష్టి సారించటం హర్షణీయం

ప్రజాశక్తి-గుంటూరు

బీసీల అభ్యున్నతికి సెప్టెంబర్ 17న రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో చర్చించి, సానుకూల నిర్ణయం ప్రకటించిన ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక చుట్టుగుంటలో ఆ సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా చట్టసభలలో రిజర్వేషన్లు కేటాయించాలన్న బీసీల డిమాండును సాకారం చేస్తూ 33 శాతం రిజర్వేషన్ల అమలుకు మంత్రిమండలి చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం హర్షణీయన్నారు. చట్ట సభల్లోనూ ఈ నిర్ణయం ఆమోదం పొందితే బిసిల హృదయాలల్లో ఈ ప్రభుత్వం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించినందుకు ధన్యావాదాలు తెలిపారు. అలాగే బీసీల్లోని 139 కులాల వారికి లబ్ధి చేకూరేలా, 56 బీసీ కులాల విడివిడి కార్పొరేషన్లను పునర్వ్యవస్థీకరించాలని తీసుకున్న నిర్ణయాలతో పాటు, ప్రతి కార్పొరేషన్ పాలకమండలికి నిధులు-విధులు కేటాయించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న హాస్టల్ విద్యార్థులు డైట్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని, సివిల్స్ శిక్షణకు చర్యలు తదితర నిర్ణయాలు సంతోకరమన్నారు. బీసీలకు రూ.100 కోట్ల మేర రాయితీ రుణాలు అందించేందుకు, రాష్ట్ర వాటా రూ.38 కోట్లను వెంటనే విడుదల చేయడం సంతోషకరమన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ట్రెజరర్ కె.మాస్టర్, గౌరవాధ్యక్షులు టి.ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

ప్రజాశక్తి తెనాలి

ఆర్టీసీ బస్సు ఢీకొని యువతి మృతి చెందిన ఘటన గురువారం తెనాలిలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన శివమణి (20) పట్టణంలోని ఓ మార్ట్లో పనిచేస్తుంది. విధి నిర్వహణకు వెళ్లేందుకు తండ్రి శ్రీనివాసరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా నందివెలుగు జంక్షన్లో వెనుక నుంచి మంగళగిరి నుంచి తెనాలి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో శివమణికి తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి శ్రీనివాసరావుకు కూడా గాయాలు కావడంతో ఇరువురిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శివమణి పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ టీచర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఈ నెల 14వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండ గ్రామానికి చెందిన అంగన్‌వాడి టీచర్ కుంచే ఆదిలక్ష్మి కుటుంబానికి తాడేపల్లి పట్టణ టిడిపి నాయకులు వెంకట్రావు సహకారంతో, అంగన్వాడి, డ్వాక్రా రాష్ట్ర సాధికార అధ్యక్షురాలు ఆచంట సునీత ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.పదివేలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌తో మాట్లాడి, అనారోగ్యంతో చనిపోయిన ఆదిలక్ష్మి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ ఆర్థిక సాయంలో టిడిపి కొలనుకొండ గ్రామ అధ్యక్షులు కంచర్ల రంగారావు, తెలుగు నాడు అంగన్వాడి ట్రేడ్ యూనియన్ అధ్యక్షురాలు జి.అనంతలక్ష్మి, జనరల్ సెక్రటరీ కె.లక్ష్మీనరసమ్మ, కోశాధికారి కె.హేమలత, యూనియన్ ప్రతినిధులు బండారు కళ్యాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగనవాడి టీచర్ ఆదిలక్ష్మి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

వరద బాధితులకు ఎన్నారై విద్యార్థుల నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజయవాడలోని బుడమేరు వరద బాధితులకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. తమ వంతు సహాయంగా ఐదు రోజులు సింగ్‌నగర్ పరిసర ప్రాంతాలలో సామాన్య ప్రజలకు నిత్యవసర వస్తువులు అందజేశారు. అదేవిధంగా ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చేందుకు వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించుటకు రోజూ నీరు, నిత్యావసర సరుకులు అందించడంలో తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అలాగే కళాశాలలో ఉన్న తమ తోటి విద్యార్థుల నుంచి సేకరించిన రూ.35 వేలు పేద ప్రజలకు అందిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటువంటి సేవ నిరతి పట్ల కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వివిధ శాఖ అధిపతులు పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందిస్తూ ప్రతివ్యక్తీ తమ జీవితంలో సాటి మనిషి పట్ల దయ, సేవా కలిగి జీవించాలన్నారు. వరద బాధితులను ఆదుకున్న విద్యార్థులను అభినందించారు.

నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఐ విద్యార్థులు

మాట్లాడుతున్న బుర్రా సాయి మాధవ్

8 నుంచి వీణ అవార్డ్స్ పరిషత్ నాటిక పోటీలు

ప్రజాశక్తి - తెనాలి

అక్టోబర్ 8 నుండి 12వ తేదీ వరకు వీణ అవార్డ్స్ 2024 పరిషత్ నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు కళల కాణాచి సంస్థ అధ్యక్షులు బుర్రా సాయిమాధవ్ తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని సిపిఐ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కళల కాణాచి, విజయవాడ వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించే పోటీలకు సాంఘిక నాటక పోటీలలో ఎనిమిది ఎంట్రీలు రాగా నాలుగు నాటకాలను, అలాగే నాటికల విభాగంలో 35 ఎంట్రీలు రాగా తొమ్మిది నాటికలను ఎంపిక చేసినట్లు చెప్పారు. పోటీలలో పాల్గొన్న కళాకారులకు కళా రంగంలో దిగ్గజాల పేరిట పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కళల కాణాచి సంస్థ ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, చెరుకుమల్లి సింగారావు, దేవరపల్లి భవాని, గరికపాటి సుబ్బారావు, బడుగు మోహనరావు, బొల్లిముంత కృష్ణ, అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఇందిరా నగర్‌కృష్ణ బలిజ కమ్యూనిటీ హాల్ ఆవరణలో కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి గణనాధుని విగ్రహం వద్ద 27వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 1500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అన్నం నాగబాబు, గడ్డం నాగేశ్వరరావు, తుపాకుల సాంబశివరావు, పురుషోత్తం, కోలా వాసుదేవ నయనార్, నాయుడు సుబ్బారావు, కోలా శంకరరావు, సీతా రామయ్య, వీరాంజనేయులు, కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగరాజు మాదిగ

రేపు మాదిగల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తెనాలి : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన తరువాత తొలిసారిగా తెనాలి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు జిల్లాలోని మాదిగలు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక మారీస్పేటలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు మొదటగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ చట్టబద్ధతకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మాదిగ విద్యార్థులు నష్టపోకుండా విద్యా, ఉద్యోగ రంగాల్లో డీఎస్సీ, గ్రూప్- 2, గ్రూప్ - 1 నోటిఫికేషన్లు విడుదలైన వాటిల్లో నష్టపోకుండా వెంటనే వర్గీకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వేమూరి సుధీర్ మాదిగ, నాయుకులు కూచిపూడి సత్యం, ఆహ్వాన కమిటీ నాయకులు మేకల సురేష్, మురికిపూడి హదయరాజు, కొండముది బోస్, తెనాలి జయ ప్రకాష్, భూదాల పవన్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి : సిఐ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని హోటల్స్, బిర్యానీ, రెస్టారెంట్ యాజమానులు, బార్ల నిర్వహాకులు నిబంధనల మేరకు పనిచేయాలని కొత్తపేట సిఐ వీరయ్య చౌదరి కోరారు. స్థానిక కొత్త పేట పోలీసు స్టేషన్‌లో గురువారం సంబంధిత యజమానులతో సమావేశం నిర్వహించారు. రాత్రి 11:00 గంటలకు అన్ని హెూటల్స్, బార్ అండ్ రెస్టారెంట్స్ మూసివేయాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల నిబంధనల మేరకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి హెూటల్ బార్ అండ్ రెస్టారెంట్ లలో పక్కగా సిసి కెమెరాల పర్యవేక్షణ ఉండాలని కోరారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని సిఐ వీరయ్య హెచ్చరించారు.

క్రీడాకారుడికి తులసి ధర్మచరణ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరానికి చెందిన ట్రయాథ్లాన్ ప్లేయర్ వీసం వెంకట నాగసాయి (అండర్ -13)కి వేదసీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. గురు వారం వేదసీడ్స్ కార్యాలయంలో నాగసాయికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ ట్రయాథ్లాన్ అనేది ఈత, సైక్లింగ్, పరుగు పందాలను మిళితం చేసే బహుళ-క్రమశిక్షణ కలిగిన క్రీడ అని, విరామం లేకుండా వరుసగా రేసులను నిర్వహిస్తారని, అథ్లెట్ల ఓర్పు, బలం, బహుముఖ ప్రజ్ఞను పరీక్షించడానికి ప్రసిద్ధి చెందిన ఈ క్రీడను ఎంచుకొని రాష్ట్ర స్థాయిలో వెంకటనాగసాయి రెండుసార్లు గోల్డ్‌మెడల్ సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అక్టోబర్ 9వ తేదీ నుండి 13వ తేదీవరకు ఈజిప్ట్‌లో జరిగే పోటీలలో నాగసాయి మనదేశం తరపున పాల్గొనటం జిల్లాకు గర్వకారణం అన్నారు. ఇలాంటి ప్రతిభగల వారిని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే దేశానికి మంచి పేరు వస్తుందని, ఒలింపిక్స్‌లో రాణిస్తారన్నారు. మోడరన్ పెన్టల్తాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అకాడమీ నుంచి భారతదేశం తరపున నాగసాయి ప్రాతినిధ్యం వహించనున్నట్లు ధర్మచరణ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేయర్ తల్లి వీశం శ్రీలక్ష్మీ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాగసాయి, అతని తల్లికి చెక్కు అందజేస్తున్న తులసి ధర్మచరణ

హరికృష్ణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

హిందూ ఫార్మసీలో జనఔషధి కేంద్రాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జనఔషధీ కేంద్రాల ఏర్పాటుపై ఫార్మాస్యూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్ డిపార్టుమెంటు, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సెల్ సంయుక్తంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథి ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైజ్ బ్యూరో ఆఫ్ ఇండియా నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.హరికష్ణ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి సహా ప్రజలందరికి చౌకగా ఔషధాలను అందించే లక్ష్యంతో జన ఔషధి కేంద్రాలను దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, అందులో భాగంగా ఆకేంద్రాలను ఏర్పాటు చేయడానికి అవసరమైన మౌలిక వసతులను గురించి తెలియచేస్తూ ఆసక్తిగల ఫార్మసిస్టులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నిరుద్యోగ ఫార్మసిస్ట్‌లకు ఒక ఉపాధి అవకాశంగా, మంచి ఆదాయమార్గంగా ఈ పథకం ఉపయోగపడుతుందని విద్యార్థులకు వివరించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు హాజరై డాక్టర్ ఎ.హరికృష్ణకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సెల్ కోఆర్డినేటర్ సి.హెచ్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై క్షేత్ర స్థాయి పర్యటన చేసిన కమిషనర్, అధికారులు

సైకిల్ వినియోగంతో పర్యావరణ హితం,ఆరోగ్యం

ప్రజాశక్తి-గుంటూరు

సైకిల్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని, శారీక ఆరోగ్యం కూడా దక్కు తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలలో భాగంగా కమిషనర్, అధికారులు, క్షేత్ర స్థాయి పర్యటనలకు సైకిల్ ని వినియోగించారు. తొలుత జిఎంసి కార్యాలయం నుండి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జిటి రోడ్‌ను అధికారులు, ప్రజారోగ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత స్వచ్ఛతతో పాటు, పరిసరాల స్వచ్ఛతను పాటించడం ద్వారా స్వచ్ఛ గుంటూరు సాధించుకోవచ్చన్నారు.రోజువారీ పనులలో సైకిల్ వినియోగం ద్వారా కాలుష్యం తగ్గటమే కాకుండా, శారీరక ఆరోగ్యం కూడా దక్కుతుందన్నారు. కావున ప్రజలు సాధ్యమైనంత వరకూ సైకిల్‌ను వినియోగించాలని కోరారు. నగరం ప్రజలు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో విరి విగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, రామారావు, మేనేజర్ ప్రసాద్, జిఎంసి అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ బిజినెస్ మేనేజ్మెంట్‌పై ఆర్‌విఆర్‌లో సెమినార్

ప్రజాశక్తి-గుంటూరు

భవిష్యత్తులో రానున్న ఐదవ ప్రపంచ పారిశ్రామిక విప్లవంలో 5.0 డిజిటలైజేషన్ దిశగా మనిషి, రోబోటిక్ సంయుక్త సహకారంతో పనిచేస్తూ వ్యాపార రంగంలో పెను మార్పులు సంభవించనున్నాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫ్యాకల్టీ అఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెడ్ అండ్ డీన్ ప్రొఫెసర్ ఆర్.శివరామప్రసాద్ పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో గురువారం ఎంబిఎ విద్యార్థులకు 'డిజిటల్ బిజినెస్ మేనేజ్మెంట్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ మొదటి ప్రపంచ పారిశ్రామిక విప్లవ సమయం నుండి ప్రస్తుతం జరుగుతున్న నాల్గవ ప్రపంచ పారిశ్రామిక విప్లవ దశ వరకూ మధ్యలో సంభవించిన మార్పులను వివరిస్తూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని టెక్నాలజీ ఆధారంగా చేపట్టాల్సిన సూచనలను విద్యార్థులకు వివరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ ఆధారంగా బిజినెస్‌లో పెనుమార్పులు సంభవించా యన్నారు. వినియోగదారుని అభిరుచులకు అనుగుణంగా టెక్నాలజీ ఆధారంగా వస్తువుల రూపకల్పన దిశగా వృద్ధి సాధించుకోవడం జరిగిందని విద్యార్థులు డిజైన్ థింకింగ్‌ను డవలప్ చేసుకోవాలని పేర్కొన్నారు. డిజిటలై జేషన్ వ్యాపార రంగం ప్రపంచ దశ దిశనే మార్చేశాయని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్ల మూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. ఎంబిఏ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, ఆధునిక సాంకేతిక కోర్సులను ఎంబిఏ విద్యార్థులకు జత చేస్తూ మెరుగైన విద్యాబోధన అందించడం ద్వారానే మంచి ప్యాకేజీలతో ప్రసిద్ధి చెందిన కంపెనీలలో తమ కళాశాల ఎంబిఏ విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివరామప్రసాద్

సెయింట్ ఆన్స్‌లో వనమహోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో గురువారం ఎకోక్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ వారు వనమహెూత్సవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంధ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యం అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, పరిసర ప్రాంతాల్లో మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఆర్.షారూన్‌రోజ్, జీవశాస్త్ర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ యూనిట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్

కానిస్టేబుల్ నోటిఫికేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గత ప్రభుత్వం ఇచ్చిన 6100 పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్‌కి సంబంధించి ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ అభ్యర్థులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.భూషణం, కె.భాస్కర్ మాట్లాడుతూ ప్రాథమిక పరీక్షల్లో 95,208 మంది అర్హత సాధించారని, వీరికి తదుపరి పరీక్షలు నిర్వహించలేదన్నారు. హోం గార్డులకు రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటమే దీనికి కారణం అన్నారు. గత ప్రభుత్వం హోం గార్డులకు రిజర్వేషన్లు పెంచటం వల్ల జనరల్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. దీనిపై హైకోర్టులో హోం గార్డులకు అనుకూలంగా వచ్చిన తీర్పుపై సుప్రీంలో కేసు కొనసాగు తుందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం విచారణకు హాజరు కావట్లేదని, దీంతో కేసు పరిష్కారం కావట్లేదన్నారు. నూతన ప్రభుత్వమైనా సుప్రీం కోర్టులో ఈకేసుపై తగిన వాదనలు వినిపించి జనరల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో రాష్ట్ర నాయకులు మహర్షి, నాని, రాంబాబు, అభ్యర్థులు అనిల్‌కాంత్, విజయ్‌గురు, వెంకటపతి పాల్గొన్నారు

ధర్నా చేస్తున్న అభ్యర్థులు, పిడిఎస్‌యు నాయకులు

వర్సిటీలో స్వచ్ఛతా హి సేవలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం గురువారం కొనసాగింది. ఇంజనీరింగ్ కళాశాలలోని ఇసిఇ, ట్రిపుల్ భవనాల వద్ద ఉన్న పొదలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ వర్శిటీని సుందరంగా తీర్చిదిద్దడంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర ఉందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సిహెచ్ రవికుమార్, ప్రోగ్రాం అధికారులు పుణ్యశేఖర్, ఉమా శంకర్, యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.